దుబ్బాకలో సొసైటీ ఏర్పాటు చేయాలి

ధర్పల్లి, జనవరి 5 : మండలంలోని దుబ్బాక గ్రామంలో నూతనంగా సొసైటీని ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం నూతన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఏర్పాటుకు సన్నాహాలు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో దుబ్బాక గ్రామంలో సొసైటీ సహకార సంఘాన్ని ఏర్పాటు చేస్తే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. దుబ్బాకతో పాటు చుట్టుపక్కల గ్రామాల రైతులకు సొసైటీతో మేలు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో రైతులు నర్సయ్య, శేఖర్‌రెడ్డి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కుమ్మరులు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలి

ధర్పల్లి, జనవరి 5 : కుమ్మరులు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని, ఆర్థికంగా, రాజకీయంగా, ఉపాధిపరంగా ఎదగాలని కుమ్మరుల సంఘం మండల అధ్యక్షుడు రాజేశ్వర్ అన్నారు. మండలంలోని దుబ్బాక గ్రామంలో కుమ్మరుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. ముందుగా మొదటి కవయిత్రి మొల్లమాంబ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వం తమను పట్టించుకున్న పాపన పోలేదని, ఐక్యంగా ఉంటూ అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కుమ్మరుల సంఘం సభ్యులు రాములు, గంగాధర్, లింగన్న, రంజిత్, గంగా రాజం, నారాయణ పాల్గొన్నారు.

దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి

అవగాహన కల్పిస్తున్న రూరల్ ఎస్సై మహ్మద్ ఆరిఫ్

వినాయక్‌నగర్, జనవరి 5 : చలికాలంలో అర్ధరాత్రులు చోరీలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రూరల్ ఎస్సై మహ్మద్ ఆరిఫ్ సూచించారు. రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మారుతీనగర్‌లో ఉన్న కమ్యూనటీ హాలులో కాలనీవాసులతో ఆదివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి, చోరీల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనుమానితులు కాలనీల్లో కనిపిస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

చైనా మాంజా విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు

వినాయక్‌నగర్, జనవరి 5 : జిల్లాకేంద్రంలోని బడాబజార్ ఏరియాలో ఉన్న కైట్స్ దుకాణాల్లో టూ టౌన్ ఎస్సై యాసిర్ అరాఫత్ సిబ్బందితో కలిసి ఆదివారం తనిఖీలు చేపట్టారు. ఎన్‌కే కైట్స్ షాపులో 4, సుల్తాన్ కైట్స్ షాపులో 5 బండళ్ల చైనా మాంజాను గుర్తించి, సీజ్ చేసినట్లు తెలిపారు. షాపుల నిర్వాహకులపై కేసులు నమోదు చేశామని తెలిపారు. చైనా మాంజా విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

20 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు

వినాయక్‌నగర్, జనవరి 5 : జిల్లాకేంద్రంలోని కంఠేశ్వర్ వద్ద ట్రాఫిక్ పోలీసులు నగరంలో ఆదివారం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించేందుకు బ్రీత్ ఎనలైజర్‌తో వాహనదారులకు టెస్ట్ చేశారు. మద్యం తాగి వాహనాలు నడిపిన 20 మందిపై కేసులు నమోదు చేసినట్లు ట్రాఫిక్ సీఐ ప్రసాద్, సిబ్బంది తెలిపారు.

మాతాశిశు మరణాలను తగ్గించేందుకు కృషిచేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాజశ్రీ

డీఎంహెచ్‌వో రాజశ్రీ

ఖలీల్‌వాడి, జనవరి 5 : జిల్లాలో మాతా శిశు మరణాలను తగ్గించేందుకు కృషిచేయాలని డీఎంహెచ్‌వో రాజశ్రీ అన్నారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించి, మాతాశిశు మరణాలపై సమీక్షించారు. సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు ముగ్గురు తల్లులు, ఐదేండ్ల లోపు చిన్నారులు 10 మంది మృతిచెందారని, ఇందుకు గల కారణాలపై సమీక్షించారు. మాతాశిశు మరణాలు చోటుచేసుకోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అవగాహన కార్యక్రమాలపై పలు సూచనలు చేశారు. వైద్యాధికారులు, పారామెడికల్ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ మాతాశిశు మరణాలు జరగకుండా చూడాలన్నారు. మాతాశిశు మరణాలకు గల కారణాలు, జీజీహెచ్‌లో అందిస్తున్న సేవలపై సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ వివరించారు. సమావేశంలో జిల్లా ఉప వైద్యాధికారులు డాక్టర్ రమేశ్, డాక్టర్ అంజన, డీఐవో అశోక్, డాక్టర్ సమత, గైనకాలజిస్ట్ అరుణరేఖ, పిల్లల వైద్యనిపుణులు నవీన్, నిరూపారెడ్డి, మత్తు వైద్యుడు సుజయ్‌కుమార్, పీవో ఎంఎసీహెచ్ సుప్రియ, ఎస్‌వో రాజేశ్వర్, డీహెచ్‌ఈ ఘన్‌పూర్ వెంకటేశ్వర్లు వివిధ పీహెచ్‌సీల వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీసీటీయూ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతి

బీసీటీయూ నాయకులతో ఉత్తమ ఉపాధ్యాయినులు

ఖలీల్‌వాడి జనవరి 5 : జిల్లాకేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో బీసీ ఉపాధ్యాయసంఘం ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హాజరై మాట్లాడారు. ప్రతి మహిళా సావిత్రీబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. బీసీటీయూ జిల్లా అధ్యక్షుడు మాడవీటి వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో 120 మంది ఉపాధ్యాయినులకు సావిత్రీబాయి పూలే పురస్కారాలు, ప్రశంసాపత్రాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, మేయర్ దండు నీతూకిరణ్, జడ్పీమాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, డీఈవో అశోక్, బీసీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సుంకర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో పాల్గొన్న 1990-91 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు

చందూర్, జనవరి 5 : మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1990-91 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు ఆదివారం పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని జరుపుకొన్నారు. అప్పటి విద్యార్థులందరూ చదువుకున్న చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వారికి చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఆహ్వానించి సన్మానించారు. ప్రస్తుతం వారుచేస్తున్న ఉద్యోగాలు, కుటుంబ వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ద్విచక్రవాహనం, వ్యాన్ ఢీ : ఒకరి మృతి

పొతంగల్ (కోటగిరి), జనవరి 5 : వ్యాన్ ఢీకొని ఒకరు మృతిచెందిన ఘటన కోటగిరి మండలం దేవునిగుట్ట తండా వద్ద ఆదివారం ఉదయం చోటు చేసుకున్నది. ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగేంద్రపూర్ గ్రామానికి చెందిన పవన్ (22) ద్విచక్రవాహనంపై పొలం వద్దకు వెళ్తుండగా దేవునిగుట్ట తండా వద్ద ఎదురుగా వస్తున్న కోళ్ల వ్యాను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పవన్ తలకు బలమైన గాయం కాగా బోధన్‌లోని దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉద్యోగం సాధించిన యువకుడికి సన్మానం

సుదీప్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

పొతంగల్ (కోటగిరి), జనవరి 5 : ఇటీవల జరిగిన పోలీసు రిక్రూట్‌మెంట్‌లో బెటాలియన్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించి, ట్రైనింగ్ పూర్తి చేసుకున్న కోటగిరి మండల కేంద్రానికి చెందిన సుదీప్‌ను గ్రామస్తులు ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో యువకుడి తండ్రి హన్మాండ్లు, గ్రామస్తులు అశోక్, చెన్నప్ప, కోలంబస్, శ్రీనివాస్, రాజు, గంగాధర్, ఆనంద్, అరుణ్, సాయిబాబా పాల్గొన్నారు.

వీడీసీకి విరాళం అందజేత

సారంగాపూర్, జనవరి 5 : మండలంలోని మల్కాపూర్ తండాలో నూతనంగా ఏర్పడిన గ్రామాభివృద్ధి కమిటీ కార్యాలయానికి తండాకు చెందిన యువకుడు బానోత్ శ్రీనూనాయక్ ఆదివారం విరాళం అందజేశారు. ఫర్నిచర్ కోసం రూ.13,500 నగదును అందజేశాడు. యువకుడిని వీడీసీ చైర్మన్ రమేశ్‌నాయక్, ప్రధాన కార్యదర్శి విస్లావత్ అరవింద్‌నాయక్, గోపాల్, సంతోష్‌కుమార్, ప్రతాప్‌నాయక్ తదితరులు అభినందించారు.

'రైతులను మోసం చేసిన రేవంత్ సర్కార్'

ధర్పల్లి, జనవరి 5 : రేవంత్ సర్కార్ రైతులను అన్నివిధాలుగా మోసం చేసిందని, ఈ ప్రభుత్వం చెప్పేదొకటి, చేసేది మరొకటి అన్నట్లు ఉన్నదని మాజీ ఎంపీపీ నల్ల సారిక పేర్కొన్నారు. మండలకేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఎన్నో మోసపూరిత వాగ్దానాలు చేసి, ప్రజలను మభ్యపెట్టి, అధికారంలోకి వచ్చిందని... అధికారంలోకి వచ్చిన తర్వాత నమ్మిన ప్రజలను నట్టేట ముంచుతున్నదని అన్నారు. ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి సంపూర్ణంగా అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారమే పరమావధిగా ఇష్టంవచ్చినట్లు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కార్‌ను ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. పరిపాలన చేతగాక పదేండ్ల పాటు తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన కేసీఆర్‌ను విమర్శించడం సిగ్గుచేటన్నారు. పరిపాలన చేతగాకపోతే గద్దె దిగాలని హితవు పలికారు. కార్యక్రమంలో రైతులు హన్మంత్‌రెడ్డి, సంతోష్, నర్సయ్య, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూలి పనిచేసే ప్రతి కార్మికుడికి ఇందిరమ్మ ఆత్మీయ భృతి ఇవ్వాలి

సిరికొండ, జనవరి 5 : కూలి పనిచేసే ప్రతి కార్మికుడికి ఇందిరమ్మ ఆత్మీయ భృతి ఇవ్వాలని ఏఐఏకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఏర్పాటై ఏడాది దాటిన తర్వాత వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి జీవనభృతి రూ.12 వేలు ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారని, రాష్ట్రంలో 60 లక్షల మంది కూలీ పని చేస్తున్నారని తెలిపారు. వారందరికీ ఇవ్వకుండా సుమారు 12 లక్షల మందికి ఇచ్చి చేతులు దులుపుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తున్నదని విమర్శించారు. కౌలు రైతులకు రైతు భరోసాని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కారులో చెలరేగిన మంటలు

మంటలను ఆర్పివేస్తున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

వినాయక్‌నగర్, జనవరి 5 : నిజామాబాద్ నగరంలో నడుస్తున్న ఓ కారు ఇంజన్‌లో నుంచి మంటలు రావడంతో అందులోని ప్రయాణికులు అప్రమత్తమై వెంటనే బయటికి వచ్చారు. నగరంలోని అహ్మద్‌పుర కాలనీ పరిధిలో ఆదివారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకున్నది. నిర్మల్ జిల్లాకు చెందిన ఓ రాజకీయ నాయకుడు తన కారులో నిజామాబాద్‌కు వచ్చాడు. నగరానికి చేరుకునే సమయంలో కారులో షార్ట్‌సర్క్యూట్‌తో వైరింగ్ కాలుతూ పొగలు, ఆపై మంటలు చెలరేగాయి. స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించగా.. వారు ఘటనా స్థలానికి చేరుకొని, మంటలను ఆర్పివేశారు.

పేకాట స్థావరంపై దాడి-జూదరుల అరెస్టు

రెంజల్, జనవరి 5: మండల శివారులో ఆదివారం సాయంత్రం పేకాట స్థావరంపై దాడులు నిర్వహించినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. రెంజల్ సహకార సంఘం గోదాము వెనుక పేకాడుతున్న సాటాపూర్ గ్రామానికి చెందిన ఐదుగురిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వారి నుంచి పేకాట ముక్కలు, రూ.9,400 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



జలాల్‌పూర్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న నాయకులు

బాల్కొండ, జనవరి 5: మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సహకారంతో బేగరి నాగుబాయికి రూ.39 వేలు, గొల్లపల్లి లక్ష్మికి రూ.21 వేల సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేసినట్లు బీఆర్ఎస్ నాయకులు ఆదివారం తెలిపారు. చెక్కుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు బాధితులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో తాజామాజీ సర్పంచ్ గడ్చంద అనిల్, ఉప సర్పంచ్ లింబారెడ్డి, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు గడ్చంద ప్రదీప్, సభ్యులు ఎంబరి నగేశ్, లిఫ్ట్ చైర్మన్ గడ్డం గంగారెడ్డి, గుండేటి అచ్చలు, మోహన్‌రెడ్డి, పెద్ద నడ్పి నర్సారెడ్డి, చిట్టి భూమన్న, కత్తి భోజన్న, నతీశ్, నవీన్‌గౌడ్ పాల్గొన్నారు.

జాతీయ జెండా ఏర్పాటుకు స్థల పరిశీలన

బోధన్, జనవరి 5: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో 101 అడుగుల ఎత్తులో జాతీయ జెండా ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. స్థానిక ఏకచక్ర సేవా సమితి ఆధ్వర్యంలో 101 అడుగుల ఎత్తులో జాతీయ జెండా ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఈనెల 26న ఈ జెండాను ఆవిష్కరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 26న జెండా ఆవిష్కరణకు రావాల్సిందిగా ఏకచక్ర సేవా సమితి ప్రతినిధులు ఎమ్మెల్యేను ఆహ్వానించారు. ఎమ్మెల్యే వెంట బోధన్ ఏఎంసీ చైర్మన్ అంకు సంధ్యాదాము, సేవా సమితి ప్రతినిధులు అంకు మహేశ్, తలాండీ ఈశ్వర్ కుమార్, విద్యావికాస్ కరస్పాండెంట్ వై.శ్రీనివాస్ రావు, లక్ష్మణ్‌రావు పటేల్, రామకృష్ణారెడ్డి, సనాపటేల్, పల్లాటి యాదగిరి ఉన్నారు.

శేష జీవితాన్ని ప్రజాసేవకు కేటాయించాలి

మానాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మోర్తాడ్, జనవరి 5: ఉన్నతమైన హోదాలో విరమణ పొంది పట్టణంలో మంచి జీవనం కొనసాగించే అవకాశం ఉన్నా, కనీ పెంచిన తల్లిదండ్రులను చూసుకోవాలని మానాల గ్రామంలో శేష జీవితాన్ని గడపాలని తీసుకున్న నిర్ణయం అందరికీ ఆదర్శమని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బాల్కొండ నియోజకవర్గంలోని మానాల గ్రామంలో ఆదివారం టౌన్ ప్లానింగ్ డిప్యూటీ డైరెక్టర్ మాలోత్ నరహరి నాయక్ ఉద్యోగ విరమణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఉద్యోగిగా, తండ్రిగా, రాజకీయ నాయకుడిగా సంపూర్ణ జీవితాన్ని అనుభవించి ఉద్యోగ విరమణ పొందుతున్న నరహరి నాయక్ శేష జీవితాన్ని ప్రజాసేవ చేస్తూ గడపాలని ఆశిస్తున్నానని అన్నారు. కార్యక్రమంలో వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కార్పొరేషన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆత్మీయ కుటుంబాలకు వేముల పరామర్శ

మానాల గ్రామంలో పర్యటించిన మాజీమంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆదివారం పలువురు ఆత్మీయ కుటుంబాలను పరామర్శించారు. అడ్డబోర్ తండాకు చెందిన ఆత్మీయులు లావుడియా నారాయణ భార్య గెనిబాయ్ కాలం చేయడంతో బాధిత కుటుంబాన్ని, బడితండాకు చెందిన గుగులోత్ రవి తండ్రి గోవింద్ కాలం చేయడంతో వారిని, సర్పంచ్ తండాకు చెందిన చిన్న గారి తండ్రి రామ్‌సింగ్ కాలం చేయడంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ముప్కాల్ మండల కేంద్రంలోని జాతీయ రహదారి 44పై మిషన్ భగీరథ పైప్ లైన్‌కు లీకేజీ ఏర్పడి నీరు వృథాగా పోతున్నది. అధికారులు స్పందించి లీకేజీని అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.
– ముప్కాల్, జనవరి 5

రైతులను మోసం చేసిన కాంగ్రెస్ సర్కారు

మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎనుగందుల పూర్ణానందం

ఏర్గట్ల, జనవరి 5: రైతు భరోసా పేరిట రూ.15 వేలు ఇస్తామని ఎన్నికల సమయంలో ప్రకటించి ఇప్పుడు రూ.12 వేలు ఇస్తామని ప్రకటించడం రైతులను మోసం చేయడమేనని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎనుగందుల రాజాపూర్ణానందం, మాజీ ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు పంట పెట్టుబడి రూ.పదివేలు ఇచ్చి ఆదుకున్నారని గుర్తు చేశారు. ఎన్నికల హామీని నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తున్నదని మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పోయిందని, కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారని అన్నారు. సమావేశంలో తాళ్లరాంపూర్ సొసైటీ అధ్యక్షుడు పెద్దకాపు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కో-ఆప్షన్ మెంబర్ అస్రాఫ్, పార్టీ మండల నాయకులు లక్కం నర్సయ్య, కుశ లింబాద్రి, దేవుడు నర్సయ్య, లోలపు అశోక్, ఏలూరి శ్రీనివాస్ రెడ్డి, కూతురు చిన్న సాయన్న, ఇమామ్, చిలుక కిషన్, అట్ల పోశన్న పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థిని ఎంపిక

సంజన

మాక్లూర్, జనవరి5: మండలంలోని దాస్‌నగర్ మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల కళాశాల ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని సంజన జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ స్వప్న ఆదివారం తెలిపారు. ఈ నెల 6వ తేదీ నుంచి 10 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడలో నిర్వహించనున్న టోర్నమెంట్‌లో పాల్గొంటుందని పేర్కొన్నారు. గత నెలలో ఖమ్మంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీల్లో జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచిందని, ఈ జట్టులో విద్యార్థిని కీలక పాత్ర పోషించడంతో జాతీయస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. జాతీయస్థాయిలో రాణించాలని ఉపాధ్యాయులు కోరారు. పాఠశాలలలో పీడీ నీరజ, పీఈటీ పావని విద్యార్థిని అభినందించారు.

నిబంధనలు పాటించాలి

శక్కర్‌నగర్, జనవరి 5: బోధన్ పట్టణంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన పతంగుల విక్రయ కేంద్రాల వారు నిబంధనలు పాటించాలని పట్టణ సీఐ వెంకట నారాయణ సూచించారు. ముఖ్యంగా చైనా మాంజాలు విక్రయించే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రత్యేక బృందాలు షాపులను తనిఖీ చేస్తాయని పేర్కొన్నారు. చైనా మాంజాలు విక్రయిస్తే తమ దృష్టికి తేవాలని ప్రజలను కోరారు.

వేల్పూర్ చెక్‌డ్యామ్‌లో పెద్ద చేప లభ్యం

లభ్యమైన చేప

వేల్పూర్ జనవరి 5: మండల కేంద్రంలోని చెక్‌డ్యామ్‌లో అరుదైన చేప బొచ్చ లభించింది. సుమారు 15 కిలోల చేప దొరకడంతో గంగపుత్రుడు బండి కిషన్ సంతోషం వ్యక్తం చేశాడు. గతంలో ఎప్పుడూ ఇంత పెద్ద చేప చెరువులు, వాగుల్లో లభించలేదన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి చెక్‌డ్యామ్ నిర్మాణానికి కృషి చేశారు. దీంతో చెక్‌డ్యామ్ సమీపంలో నీరు నిల్వ ఉండడంతో నీటిలో చేపలు పెరిగాయని, దీని ద్వారా తమకు ఆదాయం వస్తున్నదని అన్నారు. ఆదివారం చెక్‌డ్యామ్ సమీపంలో చేపలు పడుతుండగా 15 కిలోల చేప చిక్కిందన్నారు.

ఎస్సారెస్పీ నుంచి కొనసాగుతున్న నీటివిడుదల

మోర్తాడ్, డిసెంబర్ 5: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి యాసంగి పంటలకు వివిధ కాలువల ద్వారా నీటివిడుదల కొనసాగుతున్నది. కాకతీయ కాలువకు 3833 క్యూసెక్కులు, లక్ష్మి కాలువకు 200, అలీసాగర్ ఎత్తిపోతలకు 463, గుత్ప ఎత్తిపోతలకు 186, సరస్వతీ కాలువకు 700, వరద కాలువకు 5వేలు, మిషన్ భగీరథకు 231క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు (80.5టీఎంసీలు) కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 1088 అడుగులు(71.09 టీఎంసీలు) నీటినిల్వ ఉన్నది.

లక్ష్మి కాలువ నుంచి

లక్ష్మి కాలువకు ఎస్సారెస్పీ నుంచి 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా లక్ష్మీకాలువ నుంచి డి-1 కాలువకు 2 క్యూసెక్కులు, డి-2 కాలువకు 40 క్యూసెక్కులు, డి- 3 కాలువకు 105 క్యూసెక్కులు, డి-4 కాలువకు 53 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఏఈ లింబాద్రి తెలిపారు. వేంపల్లి ఎత్తిపోతలకు యూనిట్-1కు 35క్యూసెక్కులు, యూనిట్-2కు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. బోదెపల్లి ఎత్తిపోతలకు 8 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

కుల బహిష్కరణ చేస్తే కేసులు

వేల్పూర్, జనవరి5: కుల బహిష్కరణల వంటి చట్టవిరుద్ధమైన పనులకు ఎవరు పాల్పడినా కేసులు నమోదు చేస్తామని ఎస్సై సంజీవ్ ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. మండలంలోని ఆయా గ్రామాల్లోని గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు చట్టానికి వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మండలంలోని పోచంపల్లి గ్రామంలో గ్రామానికి చెందిన పలువురిని గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు బహిష్కరించడంతో కమిటీ సభ్యులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని, తాము పరిష్కరించటానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

రూ.10 కోట్ల ప్రజా సొమ్ముతో వెంచర్‌కు బ్రిడ్జిల నిర్మాణం

మాక్లూర్, జనవరి 5: మండలంలోని మానిక్‌బండార్ శివారులో 217 ఎకరాల భూమిని కొనుగోలు చేసి వెంచర్లు ఏర్పాటువేసి రెండు ప్రైవేట్ బ్రిడ్జిలను నిర్మించారని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డు గంగాధర్ ఆరోపించారు. మానిక్‌బండార్‌లో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కోసం గత ప్రభుత్వం రూ.10 కోట్ల యూఎఫ్‌డీసీ నిధులను మంజూరు చేయగా కొందరు ప్రైవేట్ వ్యక్తులు, వెంచర్ యజమానులు ఆ డబ్బులతో వెంచర్‌కు రోడ్లు నిర్మించారన్నారు. మున్సిపల్ పరిధిలో రెండో డివిజన్ అభివృద్ధికి ఖర్చు చేయాల్సిన రూ.10 కోట్ల నిధులతో రెండు ప్రైవేట్ వెంచర్లకు వంతెలనలు నిర్మించడం సిగ్గుచేటన్నారు. ప్రజల సొమ్మును దుర్వినియోగం చేశారని మండిపడ్డారు. అధికారులు స్పందించి ఆ డబ్బులు రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

నోటీసు

మహారాజశ్రీ కొప్పూరు 9వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

Between: A.S.No. 137/2011

1. శ్రీమతి కందికొండ వెంకట శేషమ్మ (డైడ్), 2) శ్రీ కందికొండ పూర్ణ ప్రకాశరావు (డైడ్), 3) శ్రీ కందికొండ ఉదయ భాస్కరరావు ... పిటీషనర్లు

మరియు

1. శ్రీ గాదె శ్రీరామ చంద్రరావు (డైడ్), 2) శ్రీ గాదె శ్రీనివాస్ & 13 మంది. ... రెస్పాండెంట్లు

రెస్పాండెంట్లు 8 టు 15:

8) కొవ్వాడి వెంకట రామయ్య తండ్రి (లేటు) సుబ్బారాయుడు, నివాసం: ఇంటి నం. సి/పాత 26 ఎన్ఎస్ఎల్ కాలనీ, సక్కర్‌నగర్, నిజామాబాద్ జిల్లా- 503180, తెలంగాణా రాష్ట్రం. 9) కొవ్వాడి వేణుగోపాలరావు, తండ్రి వెంకట రామయ్య, ఉద్యోగి, 10) కొవ్వాడి సుబ్బారావు, తండ్రి వెంకట రామయ్య క్రాప్ మర్చంట్, 11) కొవ్వాడి కృష్ణారావు, తండ్రి వెంకట రామయ్య హ్యూస్ ఏజెంట్/మెడికల్ షాపు, 8 టు 11 రెస్పాండెంట్లు చిరునామా: కోర్టు 8వ రెస్పాండెంట్లు: కొవ్వాడి వెంకట రామయ్య తండ్రి (లేటు) సుబ్బారాయుడు, నివాసం: ఇంటి నం. సి/పాత 26 ఎన్ఎస్ఎల్ కాలనీ, సక్కర్‌నగర్, నిజామాబాద్ జిల్లా- 503180, తెలంగ